క్లుప్తంగా

కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరణ

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సోమవారం ప్రభాకర్ నాయుడు కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన సహకార సంఘంలో స్టాఫ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించేవారు. ప్రమోషన్ రావడంతో కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. సహకార సంఘంలో కార్యదర్శిగా సేవలు అందించిన మద్దిలేటి గత నెల 29న రిటైర్‌మెంట్ అయ్యారు. ఆయన స్థానంలో కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. సహకారం సంఘ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆయన తెలిపారు. చిన్న, సన్నకారు రైతులను దృష్టిలో పెట్టుకొని సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

పందుల బెడదను అరికట్టాలి

మానవపాడు: ఎస్సీ బాలుర వసతి గృహం చుట్టూ పందులు సంచరిస్తున్నాయని, వాటిని అరికట్టాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఎస్సీ బాలుర వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వసతి గృహం వెనుక ఉన్న ముళ్ల పొదల దగ్గర పందుల కోసం వ్యర్థాలను వేయడం వల్ల విపరీతమైన దుర్వాసన వస్తోందని, దోమల బెడద పెరుగుతోందని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పందుల బెడద ఎక్కువై మెదడు వాపు వ్యాధి ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మల్దకల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ వంట ఏజెన్సీ మహిళలకు సూచించారు. సోమవారం స్థానిక ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించి వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే



కేటీదొడ్డి: మండలంలోని మైలగడ్డ గ్రామ శివారులోని గద్వాల–రాయచూర్ ప్రధాన రహదారి చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మండలంలోని వివిధ గ్రామాల్లో రోడ్లు చిత్తడిగా మారడంతో వాహనాలు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు దృష్టి సారించి చిత్తడిగా మారిన రోడ్లపై మొర్రం పోసి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అలంపూర్: ఈ నెల 2వ తేదీన విద్యుత్ అంతరాయం కలగనున్నట్లు అలంపూర్ చౌరస్తాలోని విద్యుత్ సబ్ డివిజన్ ఏడీఈ మహ్మద్ చిన్నమక్బుల్, ఉండవెల్లి ఏఈ శివకుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. 132 కేవీ అలంపూర్ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే అలంపూర్ చౌరస్తా 33కేవీ ఉండవెల్లి ఫీడర్లకు మధ్య అనుసంధానం చేసే లైన్ మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. అలంపూర్ చౌరస్తా 33 కేవీ లైన్‌లో 33 కేవీ ఏబీ స్విచ్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతో అలంపూర్ చౌరస్తా సబ్‌స్టేషన్ పరిధిలోని అలంపూర్ చౌరస్తా, పుల్లూరు, కలుగోట్ల, మెన్నిపాడు గ్రామాలకు హెచ్‌టీ సర్వీస్‌లకు ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలగనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. యూత్ వినియోగదారులందరూ పైవిషయాన్ని గమనించి సహకరించగలరు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివుడిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు బీచుపల్లికి చేరుకొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఆత్మకూర్: మహిళలు పొదుపు సంఘాల ద్వారా రుణాలు పొంది పురుషులకు దీటుగా ఆర్థికంగా రాణించాలని ఏపీఎం వెంకట్ అన్నారు. సోమవారం మండలంలోని జూరాలలో స్వయం సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వడ్డీ లేని రుణాలు పొంది సకాలంలో రుణాలను తిరిగి చెల్లించాలని కోరారు. ఖర్చులు, లావాదేవీలు సంఘం సభ్యులతో చర్చించాలని, వ్యక్తిగతంగా ఖర్చులు చేసిన వారిని ఉపేక్షించేది లేదన్నారు. మండలానికి 45 పాడి పశువుల యూని ట్లు, పెరటితోటలు, కోళ్లపెంపకం 100 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో మహేశ్వరమ్మ, అన్వర్‌పాష పాల్గొన్నారు.

రైతుభరోసా ఎవరికి?



- రైతుల్లో అపోహలు, పలు అనుమనాలు
- గ్రామాల్లో కరువైన అవగాహన కార్యక్రమాలు
- రైతుభరోసా, రుణమాఫీపై రైతుల్లో ఆందోళన

రాజోళి: ప్రభుత్వం అందించే రైతుభరోసా ఎవరికి? రుణమాఫీకి అర్హులెవరు? అనేది నేటి స్పష్టత లేకపోవడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ప్రస్తుతం ఎవరి నోట విన్నా రుణమాఫీ, రైతుభరోసా ఈ రెండు పేర్లు ఎక్కువగా వినిపిస్తున్నాయి. గతంలో రైతులు ఎక్కడున్నా వారికి రైతు బంధు నేరుగా వారి ఖాతాల్లో జమ అయ్యేది. దీంతో వారు తాము రైతుబంధుకు అర్హులమని నిశ్చింతగా ఉండేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తాము రైతుభరోసాకు అర్హులమా కాదా? అనే అనుమానంతో పాటు ఎన్ని ఎకరాలకు రైతుభరోసా జమ చేస్తారనే అనుమానాలు వెంటాడుతున్నాయి. ఇప్పటి దాకా రైతుబంధు అనుభవిస్తున్న వారిలో నేటి దాకా బాగాలుగా విడిపోకుండా ఉన్నవారు, ఉద్యోగులుగా ఉండి వ్యవసాయం చేస్తున్న వారికి ఇలాంటి అనుమానాలు వేధిస్తున్నాయి.

అనుమానాలు, ఆందోళనలు

రైతుభరోసా తీసుకుంటున్న వారిలో చాలా మంది సన్నకారు రైతులే ఉన్నప్పటికీ.. కొన్ని చోట్ల ఉమ్మడి ఆస్తి కలిగి ఉన్న రైతుల కుటుంబాలు చాలానే ఉన్నాయి. ధరణి వెబ్‌సైట్ రీత్యా, వారి పెద్దల భూములను పంచుకునే వీలు లేని పలు కారణాల దృష్ట్యా చాలా మంది భూమిని ఉమ్మడిగా పెట్టుకుని వ్యవసాయం చేస్తున్నారు. కానీ ప్రస్తుతం ప్రభుత్వం రైతుభరోసాలో మార్పులు చేర్పులు ఉంటాయని చెప్పడంతో వారిలో ఆందోళన మొదలైంది. కుటుంబం ఉమ్మడిగా ఉండటంతో భూమి ఎక్కువ విస్తీర్ణంలో చూపుతుందని, బాగాలుగా విడిపోతే..కుటుంబంలో అందరు సన్నకారు రైతులమే అవుతామని పంపకాలు చేసుకున్నారు. కానీ ప్రస్తుతం ఉన్న లెక్కల ఆధారంగా రైతు భరోసా వేస్తే తర్వాత పరిస్థితి ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. గతంలో చాలా మంది గ్రామాల్లో వ్యవసాయం చేస్తూనే వ్యాపారాలు ప్రారంభించారు. వ్యాపారం పెరుగుతున్న రీత్యా రుణాలు తీసుకునేందుకు, ఐటీ రిటర్న్సు తీసుకుని వ్యాపారం చేస్తున్నామని, దానితో పాటు వ్యవసాయం కూడా చేస్తున్నామని రైతులు చెబుతున్నారు. మరి కొందరు గృహ నిర్మాణాల కోసం, ఐటీని చూపించేందుకు యత్నించినప్పటికీ రుణాలు తీసుకోకపోయినా, రెండేళ్ల పాటు ఐటీ చెల్లింపులు చేసినట్లు పత్రాలు పొందారు. ఇలాంటి వారికి రైతుభరోసా వర్తిస్తుందా లేదా? అని రైతులు సందిగ్ధంలో ఉన్నారు. రుణ మాఫీకి రేషన్ కార్డు ఉండాలి, కారు ఉండకూడదు వంటి నిబంధనలు తెరపైకి రావడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. వ్యవసాయంతో పాటు కారు, జీపు లాంటి వాహనాలను అద్దెకు నడుపుతున్న వారికి రుణమాఫీ వర్తించకపోతే ఎలా అనేది రైతుల వాదన. ఇలా రుణ మాఫీ, రైతుభరోసా మార్గదర్శకాలు పూర్తిగా వెలువడకపోవడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. దీనిపై ప్రభుత్వం ఎలాంటి అవగాహన కార్యక్రమాలు లేకపోవడంతో రైతులు మరింత ఆలోచనలో పడ్డారు. ఇప్పటికైనా అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి రైతు బందు, రుణ మాఫీలపై స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

వ్యవసాయం చేస్తూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నా..



మా గ్రామంలో పొలం ఉంది. మా పెద్దలు వ్యవసాయం చేస్తుండగా, నేను కూడా వారితో పాటు పొలంలో పని చేస్తాను. కుటుంబ అవసరాలు, ఖర్చుల దృష్ట్యా నేను ప్రైవేట్ ఉద్యోగం చేస్తాను. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న మార్గదర్శకాలు ఏంటో పూర్తిగా స్పష్టత లేకపోవడంతో రుణ మాఫీ, రైతుభరోసాపై పలు అనుమానాలున్నాయి. అధికారులు వాటిని నివృత్తి చేయాలి – అనిల్, రాజోళి

అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి



గ్రామాల్లో రైతుభరోసా, రుణమాఫీపై అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక రైతులకు పలు అనుమానాలు ఉన్నాయి. వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. రుణ మాఫీ వర్తించని సన్నకారు రైతులు ఉన్నారు. వారిని దృష్టిలో పెట్టుకుని ఎలాంటి మార్గదర్శకాలు ఉంటాయనే అంశాలను రైతులకు పూర్తిగా తెలిపితే ప్రయోజనం ఉంటుంది. – విజయ్ కుమార్, సీపీఎం కార్యదర్శి రాజోళి

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు



రైతుభరోసాకు సంబంధించి ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. రాగానే గ్రామాల్లో రైతులకు విధివిధానాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వారి అనుమానాలను నివృత్తి చేస్తాం. ప్రస్తుతం రైతుల్లో నెలకొన్న సందిగ్ధతలను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తాం. – చంద్రశేఖర్, వ్యవసాయ అధికారి, రాజోళి

పది ఎకరాలకు రైతుభరోసా ఇవ్వాలి

- డీసీసీఓ ప్రసాదరావు



మానవపాడులో ప్రత్యేక సమావేశానికి హాజరైన అధికారులు, నాయకులు

మానవపాడు: రైతుభరోసా పథకంపై సలహాలు, సూచనలు కోరుతూ తెలంగాణ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సోమవారం డీసీసీఓ ప్రసాదరావు ఆధ్వర్యంలో మహాజనసభ నిర్వహించారు. పీఏసీఎస్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి అధ్యతన వహించగా, ప్రసాదరావు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రైతుభరోసా పథకంపై సభ్యులు, రైతుల సలహాలు, సూచనలు సేకరించామన్నారు. 10 ఎకరాలు ఉన్న రైతులకు రైతుభరోసా అందించాలని కోరారు. ప్రభుత్వానికి టాక్స్ చెల్లించే ఉద్యోగులకు, అధికారులకు, రైతుభరోసా అవసరం లేదన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి, సీనియర్ ఆడిటర్ యశోదమ్మ, ఉపాధ్యక్షులు అయ్యన్న, సంఘం డెరెక్టర్లు, వివిధ గ్రామాల రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతుల సలహాలే పాటిస్తారు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని కలుగోట్ల పీఏసీఎస్ గోదాం ఆవరణలో జిల్లా సహకార సంఘం అధికారి ప్రసాదరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రైతుభరోసాపై రైతుల సూచనలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. రైతులకు అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గజేందర్ రెడ్డి, ఏఓ సురేఖ, సీనియర్ ఇన్‌స్పెక్టర్ యశోద, వైస్ చైర్మన్ అక్బర్ అలీ, తదితరులు పాల్గొన్నారు.



ఉండవెల్లిలో రైతులతో సమావేశమైన అధికారులు

గర్భిణులు షోషకాహారం తీసుకోవాలి



మల్దకల్: గర్భిణులు షోషకాలు ఎక్కువ ఉండే పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ స్వరూపరాణి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షకాలంలో సీజనల్‌గా వచ్చే వ్యాధులపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. మంచి పోషకాలుండే ఆహారంను తీసుకోవాలని గర్భిణులకు సూచించారు. నెలనెలా వైద్యపరీక్షలు చేయించుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, వెంకటస్వామి, జ్యోతి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.


వసతిగృహాల తరలింపు జీఓ రద్దు చేయండి



అలంపూర్‌లో కళాశాలల వసతి గృహంలో వసతులపై ఆరా తీస్తున్న సీపీఎం నాయకులు


అలంపూర్: కళాశాలల సంక్షేమ వసతి గృహ తరలింపు జీఓను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజు, మండల కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. అలంపూర్ పట్టణంలోని కళాశాల బాలికల, బాలుర సంక్షేమ వసతి గృహాన్ని సీపీఎం నాయకులు సోమవారం సందర్శించారు. ఒత్తిళ్లతో తిరిగి పునః ప్రారంభించిన కళాశాలల్లో విద్యార్థులకు కల్పించిన వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అలంపూర్ మున్సిపాలిటీలో ప్రభుత్వ కళాశాల వసతి గృహాన్ని యథావిధిగా కొనసాగించేందుకు జిల్లా అధికారులు అనుమతి ఇవ్వడంతో ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలోనే కళాశాల సంక్షేమ వసతి గృహాలను శాశ్వతంగా కొనసాగించాలన్నారు. వసతి గృహాలపై అధికారులు గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పత్రికలు, కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. అలంపూర్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే కళాశాల సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు పెరగడానికి అవకాశం ఉంటుందన్నారు. బాలికల ఉన్నత విద్య శాతం పెరగడానికి దోహదపడుతుందన్నారు. భవిష్యత్‌లో కళాశాలల వసతి గృహాలను తరలించడానికి ప్రయత్నాలు చేస్తే ప్రజలను, విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వీరితో పాటు సీపీఎం నాయకులు అయ్యప్ప తదితరులు ఉన్నారు.

వైద్యురాలికి ఘనంగా సన్మానం



అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీ మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రసూనరాణిని వైద్యసిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. డాక్టర్స్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ ప్రసూనరాణిని శాలువా, పూల మాలతో సత్కరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీకాంతం, ఎంపీ బాలీశ్వరయ్యశెట్టి, వైద్య సిబ్బంది మాధవి, గుల్‌నార్ బేగం, హైమావతి, రవికుమార్, లక్ష్మీనారాయణ, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వీధి లైట్లకు మోక్షమెప్పుడో?



జూలెకల్‌లో వెలగని వీధిలైటు

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్ గ్రామంలో వీధిలైట్లు లేక గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలోని ఆయా వీధుల్లో ఏర్పాటు చేసిన వీధి స్తంభాలకు చాలా చోట్లలైట్లు లేకపోవడంతో రాత్రి వేళ బయటకు వెళ్లాలంటే గ్రామస్తులు భయపడుతున్నారు. నెలరోజుల్లో ఐదు మందికి పాములు కరిచాయి. దీంతో రాత్రి వేళల్లో బయటికి వెళ్లాలంటే భయంగా ఉందని వాపోతున్నారు. వీధిలైట్లు వేయాలని పంచాయతీ సెక్రటరీతో మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ, ఎంపీఓ, ప్రత్యేకాధికారులు స్పందించి జూలెకల్‌లో వెంటనే వీధిలైట్లు వేయించి ప్రజలు విష సర్పాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మొక్కలను జాగ్రత్తగా పెంచాలి

మానవపాడు: మండల కేంద్రంలో వనమహోత్సవంలో భాగంగా సోమవారం ఎంపీపీ అశోక్‌రెడ్డి, ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మొక్కలు నాటడమే కాకుండా, మొక్కల జాగ్రత్తగా పెంచాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌చార్జి ఎంఈఓగా అశోక్‌కుమార్

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల ఇన్‌చార్జి విద్యాధికారిగా అశోక్‌కుమార్ సోమవారం నియామకమయ్యారు. గతంలో ఇక్కడ ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న రాజు ఇటీవల పదవీ విరమణ పొందారు. దీంతో అలంపూర్ ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా విద్యాధికారి ఇందిర ఉత్తర్వులు జారీ చేశారు.

నిత్యం ప్రజల్లో ఉండాలి

ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



ఎంపీపీకి జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గట్టు: ప్రజాప్రతి నిధులుగా ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ, పదవి ఉన్నా, లేకున్నా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటే మళ్లీ గుర్తింపు లభిస్తుందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పదవీ కాలం పూర్తి చేసుకున్న ఎంపీటీసీలు, సర్పంచులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారంపై దృష్టిని సారించాలన్నారు. ఇక్కడున్న వారంతా మళ్లీ ప్రజాప్రతి నిధులుగా ఎన్నికై రావాలని కోరారు. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడకుండా పంచాయతీ కార్యదర్శులు దృష్టిని సారించాలన్నారు. ఎంపీపీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో గట్టు మండలానికి ఎంతో సేవ చేసినట్లు తెలిపారు. కాల్వల ద్వారా సాగు నీరందించడంతో వలసలు వెళ్లే ప్రాంతం నుంచి ఇక్కడికే ఇతర ప్రాంతాల వారు వలస వచ్చే పరిస్థితులు ఉన్నట్లు తెలిపారు. విద్యారంగ సమస్యలు, గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేసినట్లు తెలిపారు. జెడ్పీటీసీ బాసు శ్యామల మాట్లాడుతూ రెండు పర్యాయాలు జెడ్పీటీసీగా ఆదరించిన గట్టు మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేసుకున్నట్లు వైస్ ఎంపీపీ సుమతి తెలిపారు. అనంతరం ఎంపీటీసీలను, అధికారులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్, సీడీపీఓ కమలాదేవి, తహసీల్దార్ సరితారాణి, ఎంపీడీఓ చెన్నయ్య, వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



పాతబస్టాండులో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

గద్వాల అర్బన్: భవన నిర్మాణ కార్మికులకు తరహాలో డ్రైవర్లకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండు ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఉపాధి కోల్పోయిన రవాణా రంగ కార్మికులకు రూ.12వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చిందని, కానీ ఆ దిశగా ఇప్పటి వరకు ప్రభుత్వం చర్యలు తీసుకోలేదన్నారు. కార్మిక సంఘాలతో చర్చించిన తర్వాతే హిట్ అండ్ రన్ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నర్సింహ, ముజీబ్, రాజేష్, రాజేందర్, వెంకటేష్ ఉన్నారు.

నిధులు మంజూరైనా మరమ్మతులో జాప్యం



గుంతలతో ప్రమాదాలు సంభవిస్తున్న దారి

- ఆదమరిస్తే ప్రమాదమే..
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టంలోని పోస్టాఫీస్ నుంచి వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం మీదుగా చాకలివీధి వరకు రోడ్డు మరమ్మతుల కోసం నిధులు మంజూరై ఇంతవరకు పనుల చేపట్టడం లేదు. అధికారులు ప్రజా ప్రతినిధులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. వీధుల్లో రోడ్లు వేసి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోకపోవడంతో గుంతల మయంగా మారాయి. ఈ దారిలో నిత్యం వాహనాలు, ప్రజలు తిరుగుతుంటారు. జోగుళాంబ అమ్మవారి ఆలయానికి, కన్యకాపరమేశ్వరి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో ఈ దారిలో వెళ్తుంటారు. కన్యకాపరమేశ్వరి ఆలయం ముందు మొత్తం గుంతలు ఏర్పడడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు శ్రీనివాసులు, రాజేష్, ప్రసాద్, కుమార్, శ్రీధర్, మురళీ, ఫణి, రవికుమార్ కోరుతున్నారు.

త్వరలో రోడ్డు పనులు చేపడతాం..



పట్టణంలోని అన్ని కాలనీల రోడ్లకు నిధులు మంజూరయ్యాయి. టెండర్లు కూడా పూర్తయ్యాయి. ప్రభుత్వం మారడంతో పనుల్లో జాప్యం జరుగుతుంది. త్వరలో అన్ని కాలనీల రోడ్ల మరమ్మతు పనులు చేపడతాం. – మనోరమ, మున్సిపల్ చైర్‌పర్సన్, అలంపూర్

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

గద్వాల క్రైం: జిల్లా ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్న కార్మికులను అక్రమంగా తొలగించారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. సోమవారం జిల్లా ఆస్పత్రి ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడా రు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్మికులుగా పని చేస్తున్న వారిని అకారణంగా తొలగించడం హేయమైన చర్య అన్నారు. కార్మికుల సమస్యలపై ఈ నెల 3న హైదరాబాద్ డీఎం కార్యాల యం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపా రు. అనంతరం జిల్లా సూపరింటెండెంట్ నవీన్ క్రాంతికి వినతిపత్రం అందజేశారు.

స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ పక్కాగా ఉండాలి

వనపర్తి టౌన్: విద్యార్థులను తరలించే ప్రైవేట్ స్కూల్ బస్సుల సామర్థ్యం పక్కాగా ఉండేలా చూడాలని, ఫిట్‌నెస్ లేకుండా బస్సు నడిపితే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది డిమాండ్ చేశారు. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆర్టీఓ కార్యాలయంలోని జిల్లా రవాణాశాఖ అధికారిని మానసకు స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై రవాణాశాఖ అధికారులు దృష్టి సారించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్‌స్కూల్ బస్సుల డ్రైవర్లు మద్యం తాగి విద్యార్థుల ప్రాణాలను బలిగొంటున్నారని, రవాణా శాఖ అధికారులు స్పందించాలని కోరారు.

ఏకపక్షంగా చట్టాల అమలు సరికాదు



అలంపూర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న పబ్లిక్ ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు నాయకులు

అలంపూర్: కేంద్ర ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలతో కొత్త రవాణా చట్టాలను అమలు చేయడం సరికాదని రాష్ట్ర పబ్లిక్ ప్రైవేటు రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. అలంపూర్ చౌరస్తాలో ఏఐటీఆర్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు వాహనదారులు సోమవారం ఆందోళన చేపట్టారు. ప్లకార్డులను ప్రదర్శిస్తు తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ...భారత న్యాయ సంహిత చట్టంలోని హిట్ అండ్ రన్ 106(1)సెక్షన్‌ను కార్మిక సంఘాలు, మేధావులతో చర్చించిన తర్వాతనే అమల్లోకి తేవాలన్నారు. ప్రమాదానికి గల కారణాలను పూర్తిస్థాయిలో సమగ్రంగా పరిశీలించిన తర్వాతే చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికుల సంక్షేమం కోసం చట్టాలు తీసుకరాకపోగా ఉన్న చట్టాలను రద్దు చేసి భద్రతను గాలికివదిలేస్తుందని ఆరోపించారు. కేంద్రం తెచ్చిన ఈ అసమగ్ర చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయమని స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రవాణా రంగా కార్మికులకు సమగ్ర చట్టం తీసుకువచ్చి భద్రతకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి, రఫీ, ప్రసాద్ రెడ్డి, రాము, విజయ్, ప్రకాష్, శివ, పరుశురాముడు, సుభాన్ తదిరులు పాల్గొన్నారు.